సాక్షి పార్వతీపురం మన్యం

శుక్రవారం । 20 । జనవరి । 2023



ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి..!

బతికిందే ఊరు..మానిందే మందు అన్న చందాన కష్టాన్నే నమ్ముకున్న వారికి భాష, ప్రాంతంతో పనిలేదని నిరూపిస్తున్నారు. - 8లో



26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

జిల్లాలో ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగాన్ని నిషేధించాలని సంబంధిత విభాగాల అధికారులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. - 8లో



ఆకు కూరలతో ఆదాయం

రామభద్రపురం అంతరరాష్ట్ర మార్కెట్ ఆకు కూరలకు కేరాఫ్‌గా మారింది. ఈ ప్రాంతంలోని సుమారు 700 కూరాకుల కుటుంబాలు పాలకూర, తోటకూర, మెంతాకు, గోంగూర, చుక్కకూర, కొత్తిమీర, పుదీనాను విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నాయి. - రామభద్రపురం

న్యూస్‌రీల్

విద్యుత్ స్తంభాలపై ఏనుగుల దాడి



ఏనుగులు దాడిచేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఇలా...

జియ్యమ్మవలస: మండలంలోని కుదమ గ్రామ సమీపంలో బుధవారం రాత్రి ఏనుగులు ఆరు విద్యుత్ స్తంభాలను విరిచి బీభత్సం సృష్టించాయి. విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లపై దాడిచేశాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించాయి. విద్యుత్‌శాఖ సిబ్బంది గురువారం కొత్తగా స్తంభాలు వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వారం రోజులుగా కుదమ గ్రామ పరిసరాల్లో ఏనుగులు సంచరిస్తుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ సిబ్బంది కోరుతున్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



దళాయివలసలో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న పీడీ రామచంద్రరావు

గరుగుబిల్లి: మండలంలోని దళాయివలస గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను డుమా పీడీ కె.రామచంద్రరావు గురువారం పరిశీలించారు. అధికమంది వేతనదారులు పనిలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. రోజుకు రూ.257లు వేతనం గిట్టుబాటయ్యేలా కొలతల ప్రకారం పనిచేయించాలన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో వేతనదారుల మస్టర్లు వేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ టి.రామకృష్ణంనాయుడు, జేఈ వై.రామదుర్గప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ఆత్మీయ సత్కారం



విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌తో డీఎస్సీ 98 అభ్యర్థులు

బొబ్బిలి: బొబ్బిలి గురుకుల పాఠశాల సందర్శనకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ గురువారం వచ్చారు. ముందుగా ఆయన రైల్వే గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. ఆయనను డీఎస్సీ–98 అభ్యర్థులు కలిశారు. నియామకాలు వేగంగా చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం దుశ్శాలువతో సత్కారించారు. ప్రవీణ్‌ప్రకాష్ మాట్లాడుతూ త్వరలోనే నియామక ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు.

వాహనం ఆపి.. క్షతగాత్రులను తరలించి...



ఏబీ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్న సబ్ కలెక్టర్

భామిని: పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్‌కమర్ ఔదార్యాం చూపారు. భామిని మండలం పెద్దదిమిలి–సతివాడ గ్రామాల మధ్య ఏబీ రోడ్డుపై గురువారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని సతివాడకు చెందిన పాతుల నాగరాజు, నులకజోడు గ్రామానికి చెందిన లోపింటి అనిల్ గాయపడ్డారు. అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న సబ్‌కలెక్టర్ ప్రమాదాన్ని చూసిన వెంటనే వాహనం ఆపారు. గాయపడిన నాగరాజును తన వాహనంలో ఎక్కించి సీసీ రాంబాబు సాయంతో కొత్తూరు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అనిల్‌ను ప్రత్యేక వాహనం ద్వారా ఇదే ఆస్పత్రికి తీసుకువచ్చారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి పాలకొండ రిఫర్ చేశారు. సబ్ కలెక్టర్ చూసిన చొరవపై స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ పెద్దదిమిలి, చిన్నదిమిలి సచివాలయాలను సందర్శించారు. ధాన్యం కొనుగోలుపై ఆర్‌బీకే సిబ్బందిని ప్రశ్నించారు. చినదిమిలి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు.



అందరికీ పని కల్పించేలా...

ఉపాధి ప్రణాళికలు

- గ్రామసభల్లో పనుల గుర్తింపు
- పంచాయతీల తీర్మానాలతో యాక్షన్ ప్లాన్ సిద్ధం
- ఈ ఏడాది కోటి23 లక్షల పనిదినాల కల్పనకు చర్యలు
- దాదాపు లక్షా 89వేల మంది వేతనదారులకు పని కల్పించేలా ప్రణాళిక

పాలకొండ రూరల్: ఖరీఫ్ సీజన్ పూర్తయింది. రబీ సీజన్‌లో వ్యవసాయ పనులు చకచకా సాగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో పనుల బిజీ తగ్గనుంది. జాబ్‌కార్డు ఉన్న గ్రామీణ వేతనదారులందరికీ పని కల్పించడమే లక్ష్యంగా ఉపాధిహామీ పథకం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. గత ఏడాది అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించి పనులు గుర్తించారు. వాటిని ప్రాధాన్యతాక్రమంగా పూర్తిచేసేందుకు మండల పరిషత్‌లో ఆమోదింపజేశారు. ఈ క్రమంలో 2023–24 ఏడాదికి సంబంధించి ఉపాధి యాక్షన్‌ప్లాన్‌ను సిద్ధం చేశారు.

‘ఉపాధి’ లక్ష్యం ఇదీ..

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో ఉన్న 452 పంచాయతీల్లో ప్రస్తుతం లక్షా 89 వేల మంది జాబ్ కార్డుదారులు క్రమం తప్పకుండా పనులకు హాజరవుతున్నారు. గత ఏడాది లక్షా 71వేల మంది జాబ్‌కార్డు దారులకు 81.17 లక్షల పని దినాలు కల్పించారు. రూ.159.58 కోట్లను వేతనం రూపంలో, రూ.24.64కోట్లను మెటీరియల్ రూపంలో చెల్లించారు. ఈ ఏడాది కూడా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నది లక్ష్యంగా నిర్ణయించారు. కోటి 23 లక్షల పనిదినాలు కల్పించేలా పంచాయతీల వారీగా చర్యలు తీసుకున్నారు. వేతనాల రూపంలో రూ.257 కోట్లు చెల్లించేలా యాక్షన్ ప్లాన్ సిద్ధమైనట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

పనుల కల్పన ఇలా...

ఉపాధిహామీ పనుల్లో భాగంగా చెత్త నుంచి సంపద సేకరణ కేంద్రాలు జిల్లాకు 452 మంజూరయ్యాయి. వాటిలో 442 వివిధ దశల్లో ఉండగా, స్థల సేకరణ జరగక, ఇతర కారణాలతో 10 కేంద్రాలు ప్రారంభానికి నోచుకోలేదు. అలాగే, అమృత సరోవర్ పథకం కింద 15 మండలాల్లో 75 చెరువులు అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. వాటిలో 33 చెరువుల పనులు పూర్తిచేయగా మిగిలిన 42 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే, జగనన్న గృహ నిర్మాణ పథకం ద్వారా పేదల గృహ నిర్మాణాలకు సంబంధించి పునాది గోతులు తీయడం, మట్టి పనులకు సంబంధించి 2,91,904 పనిదినాలు కల్పించేలా చర్యలు చేపట్టారు. వీటితోపాటు రైతుల సాగునీటి సమస్యలు దృష్టిలో పెట్టుకుని నాలుగు నియోజకవర్గాల్లో 124 ప్రధాన సాగునీటి వనరుల పరిధిలో 224 కిలోమీటర్ల మేర కాలువల పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు స్పష్టంచేశారు.

జిల్లాలో ఉపాధి వేతనదారుల వివరాలు ఇలా...	
మండలాల సంఖ్య	15
పంచాయతీలు	452
వేతనదారుల సంఖ్య	5.06 లక్షలు
మంజూరుచేసిన జాబ్ కార్డులు	2.14 లక్షలు
పనులకు హాజరవుతున్న జాబ్‌కార్డు దారుల సంఖ్య	1.89 లక్షలు
ఈ ఏడాది కల్పించనున్న పనిదినాలు	కోటి 23లక్షలు
వేతన మొత్తాల చెల్లింపు అంచనా	రూ.257 కోట్లు

ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం



ప్రజా ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని జిల్లా వ్యాప్తంగా పనులు గుర్తించాం. సర్పంచ్‌ల సమక్షంలో మూడు నెలలపాటు గ్రామ సభలు చేపట్టి ముందస్తు ప్రణాళికలు సిద్ధంచేశాం. జాబ్‌కార్డు ఉన్న అందరికీ పని కల్పిస్తాం. 15 మండలాల్లో 1.23 కోట్ల పనిదినాలు కల్పించేలా యాక్షన్ ప్లాన్ రూపొందించాం. ఉపాధి పనుల ద్వారా జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. జాబ్‌కార్డుకు దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు అందించేలా సిబ్బందికి సూచనలు చేశాం.

– కె.రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా

కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు

పక్కా ఏర్పాట్లు

- ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



పరీక్ష ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎస్పీ

పార్వతీపురంటౌన్: ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు భద్రతా ఏర్పాట్లపై జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులు, రీజినల్ కోఆర్డినేటర్, నోడల్ ఆఫీసర్స్, జిల్లా పోలీస్ సిబ్బందితో ఆయన గురువారం సమీక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించ వలసిన నియమ నిబంధనలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు) ఈనెల 22న నిర్వహించనున్న పరీక్షలకు నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, ఎలాంటి అనివార్య సంఘటనలకు తావులేకుండా గట్టి భద్రతా చర్యలను చేపట్టినట్లు తెలిపారు. ప్రతీపరీక్ష కేంద్రం వద్ద అవసరమైన మేరకు పోలీసు సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పోలీసు అధికారులు, రీజనల్ కోఆర్డినేటర్లతో పకడ్బందీ చర్యలతో పాటు ఎక్కడా ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులందరూ నియమ నిబంధనలను పాటిస్తూ సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకుని, క్రమశిక్షణ పాటిస్తూ పరీక్షలను రాయాలని పిలుపునిచ్చారు.

19 కేంద్రాలలో 4,822 మంది అభ్యర్థులు

పార్వతీపురం మన్యం జిల్లాలో పరీక్ష రాసే అభ్యర్థులు 4,822 మంది ఉండగా వారి కోసం 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో 17, సీతానగరంలో 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

నిబంధనలు ఇవి..

- పరీక్ష కేంద్రానికి వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం ధ్రువీకరించిన ఆధార్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ కార్డ్, పాస్‌పోర్ట్, పాన్ కార్డ్‌లలో ఏదైనా ఒకటి తీసుకుని రావాలి.
- 22వ తేదీన ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం కానుంది. కావున అభ్యర్థులను 9 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు.
- ఉదయం 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించరు. పరీక్ష సమయంలో (10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు) అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి పంపరు.
- కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించి బందోబస్తు ఏర్పాటు చేశారు.
- పరీక్షా కేంద్రానికి వచ్చే అభ్యర్థులు ఏ విధమైన ఎలక్ట్రానిక్ పరికరాలు అంటే వాచ్, బ్లూటూత్, ఇయర్ ఫోన్స్ తదితరాలు తీసుకురాకూడదు.
- పరీక్ష కేంద్రాలలో ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశారు.
- దూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులు ఒకరోజు ముందే పరీక్ష కేంద్రం ఉన్న పట్టణానికి చేరుకోవడం మంచిది.
- పరీక్ష కేంద్రం వద్ద 30 పోలీసు యాక్ట్, 144వ సెక్షన్ అమలులో ఉంటుంది. ఎవరూ గుమిగూడరాదు
- అభ్యర్థుల విలువైన వస్తువులకు వారే బాధ్యత వహించవలసి ఉంటుంది.

కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, రీజనల్ కో ఆర్డినేటర్ డా. సీహెచ్ చలపతి, పార్వతీపురం డీఎస్పీ ఎ.సుభాష్ , ఎస్పీ సీఐ ఎన్.శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

భక్తుల క్షేమమే ప్రధానం

- ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు వచ్చే భక్తుల క్షేమమే లక్ష్యంగా మెరుగైన ఏర్పాట్లు చేయాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశించారు. శంబర గ్రామంలో సాగుతున్న జాతర ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. ముందుగా ఆయనకు ఆలయ ఈఓ రాధాకృష్ణ, ట్రస్టు బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో వేదపండితులు ఆరవెల్లి విజయకుమార్‌శర్మ ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం చదురుగుడి వెనుక ఉన్న క్యూలైన్‌లు, పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. జాతరకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున మరుగుదొడ్ల నిర్వహణపై ఆరా తీశారు. గోముఖినది బ్రిడ్జి రక్షణ గోడపై ఖాళీ స్థలాన్ని బారికేడ్లతో మూసివేయించాలని సీఐ ధనుంజయరావు, ఎస్ఐ పైడిరాజును ఆదేశించారు. చదురుగుడి ముందు భాగం వైపు భక్తులు లోపలకు ప్రవేశించకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలు పగడ్బందీగా నిర్వహించాలన్నారు. పార్కింగ్ స్థలాలు దాటి వాహనాలు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ దిలీప్‌కిరణ్, డీఎస్పీ సుభాష్ పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



క్యూలైన్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ

కలెక్టర్‌ను కలిసిన డీటీఓ



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న డీటీఓ మల్లికార్జునరెడ్డి

పార్వతీపురం: జిల్లా రవాణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జునరెడ్డి కలెక్టర్ చాంబర్‌లో గురువారం కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తమ సేవలతో ప్రజల మన్ననలు పొందాలని కలెక్టర్ ఆయనకు సూచించారు.

చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రజల ఆహారంలో చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. భూముల రీసర్వే, భూసేకరణ, మ్యుటేషన్, జాతీయరహదారులు, ఇ–క్రాప్, పీఎం కిసాన్, బిందు సేద్యం, జగనన్న పాలవెల్లువ, వైఎస్సార్ చేయూత, గృహ నిర్మాణం, అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా వాటి వినియోగాన్ని పెంచడం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రెండోవిడత 78 గ్రామాల్లో సర్వే గ్రౌండింగ్ పనులు పూర్తయ్యాయన్నారు. రీసర్వే పనులు రానున్న 15 రోజుల్లో పూర్తిచేస్తామని వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని శాఖలవారీగా సమీక్షించారు. కార్యక్రమంలో జేసీ ఒ.ఆనంద్, పీఆర్ ఈఈ ఎంవీజీ కృష్ణాజీ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్, మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య, పశుసంవర్ధక శాఖ అధికారి ఈశ్వరరావు, ఆర్‌డబ్ల్యూస్ ఈఈ ప్రభాకరరావు, హౌసింగ్ పీడీ రఘురాం, డుమా పీడీ రామచంద్రరావు తదతరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత యోగి వేమన



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, జేసీ, ఆర్డీఓ తదితరులు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: సామాజిక చైతన్యానికి స్ఫూర్తి ప్రదాత యోగి వేమన అని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అభివర్ణించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో యోగి వేమన జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేమన పద్యాలు లోకానికి నీతిని అందించాయని, సామాజిక చైతన్యానికి ప్రతీకలని పేర్కొన్నారు. వేమన స్పృశించని అంశం లేదని, సమాజంలో అన్ని సమస్యలను భిన్నకోణంలోనుంచి చూసి వాటి పర్యవసానాలను విశదీకరించారన్నారు. సామాజిక, కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లను, సామాజిక జీవనంలోని ప్రతీ అంశం మీద వేమన పద్యాలు చెప్పారన్నారు. ఆంగ్ల, ఐరోపా భాషలు, ద్రావిడ భాషల్లోకి వేమన పద్యాలు అనువదించబడ్డాయన్నారు. ఐక్యరాజ్యసమితి యునెస్కో విభాగం నేటి ప్రపంచ భాషా కవుల్లో ఒకరిగా వేమనను ఎంచుకొని ఆ రచనలను పలు భాషల్లోకి అనువదింపజేయడం వేమన గొప్పతనానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఒ.ఆనంద్, ఆర్డీఓ కె.హేమలత, పరిపాలనాధికారి ఆర్.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది ఫుల్..

సేవల్లో జోష్

జిల్లాలో వైద్య సిబ్బంది ఇలా..	
వైద్యుల సంఖ్య	83
స్టాఫ్‌నర్సులు	99
ఎంఎల్‌హెచ్‌పీలు	281
సీహెచ్‌ఓలు	10
ఫిజియోథెరపీ సిబ్బంది	19
హెల్త్ ఎడ్యుకేటర్లు:	07
ఎంపీహెచ్‌ఈఓలు:	34

- వైద్యశాఖలో ఖాళీలన్నీ భర్తీ
- వైద్యులకు అర్హత బట్టి ఉద్యోగోన్నతి
- పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండడంతో రోగులకు మెరుగైన వైద్యం



పార్వతీపురంటౌన్: వైద్యశాఖలో ఉద్యోగ నియామకాలు నిరంతర ప్రక్రియగా సాగుతోంది. కొత్త పోస్టులతో పాటు ఉద్యోగ విరమణలతో ఖాళీ అయిన పోస్టులను ఎప్పటికప్పుడే ప్రభుత్వం భర్తీచేస్తోంది. దీంతో పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని ప్రధాన ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో సిబ్బంది, వైద్యులు పూర్తిస్థాయిలో ఉన్నారు. దీంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి.

నియామకాల్లో పారదర్శకత..

గత ప్రభుత్వ హయాంలో సిఫార్సులతోనే ఉద్యోగాలు ఇచ్చేవారని, పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారాయన్న విమర్శలు వినిపించేవి. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పరిస్థితి పూర్తిగా మారింది. జిల్లా సెలక్షన్ కమిటీ ఏర్పాటు చేసి, ప్రతీ నియామకాన్ని పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా చేపడుతోంది. మెరిట్ లిస్టులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తోంది. అభ్యంతరాలను స్వీకరిస్తోంది. దీంతో అర్హత ఉన్నవారు రూపాయి ఖర్చులేకుండా ఉద్యోగం సాధిస్తున్నారు.

సేవల జోరు..

గతంలో పార్వతీపురం జిల్లాలో కేవలం 40 మంది స్టాఫ్‌నర్సులు ఉండేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 99కి చేరింది. కొత్తగా 59 స్టాఫ్‌నర్సు పోస్టులను క్రియేట్ చేసి నియామకాలు చేపట్టారు. జిల్లాలో 59 మంది వైద్యులు విధులు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 83కి చేరింది. జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు సేవలందిస్తున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యశాఖలో ఉద్యోగోన్నతుల కల్పన వేగంగా జరుగుతోందని వైద్యులు పేర్కొంటున్నారు.

ఎప్పటి ఖాళీలు అప్పుడే భర్తీ..



వైద్యశాఖలో నియామకాల ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోంది. జిల్లా ఏర్పాటుతో వైద్య ఆరోగ్య శాఖలో ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేస్తున్నాం. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలోనూ ఇద్దరు చొప్పున వైద్యులను నియమించి ఫ్యామిలీ డాక్టర్ విధానం, పీహెచ్‌సీలలో పూర్తి స్థాయిలో వైద్యాన్ని అందించగలుగుతున్నాం. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బందిని నియమించాం.

– డాక్టర్ వినోద్, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ, పార్వతీపురం మన్యం

శుభపరిణామం..



వైద్యశాఖలో ఒక్కఖాళీ కూడా లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం మంచి పరిణామం. ఎప్పటికప్పుడు అధికారుల నుంచి ఖాళీల వివరాలను తీసుకుని, నోటిఫికేషన్లు ఇస్తూ ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాం. పూర్తిస్థాయిలో ఉద్యోగులు అందుబాటులో ఉండడంతో రోగులకు సకాలంలో సేవలు అందుతున్నాయి. ఒకప్పుడు ఇద్దరు, ముగ్గురు చేసే పనిని ఒకరు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– డా.బి.జగన్నాథరావు, డీఎంఅండ్ హెచ్‌ఓ, పార్వతీపురం మన్యం

క్లుప్తంగా

పోలీస్ సంఘం డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కమాండెంట్ విక్రాంత్ పాటిల్, తదితరులు

డెంకాడ: రాష్ట్ర పోలీస్ సంఘం డైరీని చింతలవలస ఏపీఎస్పీ ఐదవ బెటాలియన్ కమాండెంట్ విక్రాంత్ పాటిల్‌తో పాటు పలువురు అధికారులు, సంఘం నాయకులు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ డి.వి.రావు, వి.నారాయణరావు, ఆర్ఐలు చంద్రశేఖర్, వెంకటరావు, కేకేఎం.రాజు, బాలకృష్ణ చౌదరి, సంఘం బెటాలియన్ అధ్యక్షుడు మిత్తిరెడ్డి అప్పలనాయుడు, సెక్రటరీ ఎం. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మధుపాడలో డయేరియా ఛాయలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న వైద్యుడు సాయికృష్ణ

గజపతినగరం రూరల్: మండలంలోని మధుపాడ గ్రామంలో డయేరియా ప్రబలినట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. గ్రామంలోని మొండి వీధికి చెందిన ఐదు కుటుంబాల వారు గడిచిన కొన్నిరోజులుగా నీళ్ల విరోచనాలతో అనారోగ్యం పాలైనట్లు స్థానికుల సమాచారం. ఇటీవల రెండు రోజుల నుంచి బైరెడ్డి.రాధ, బెరెడ్డి విష్ణు, బూడి పవన్, వలిరెడ్డి రోషిణిలు వాంతులు, విరేచనాలతో బాధ పడుతూ గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన విషయం తెలుసుకున్న మరుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు సాయికృష్ణ వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు.

నిరుద్యోగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



పార్వతీపురం: శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాల కోసం పార్వతీపురం మన్యం జిల్లాలో 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసు కలిగి అర్హత గల నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ మేరకు సాలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాల కోసం శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐ/డిప్లమో అర్హతతో ఫోర్ వీలర్ టెక్నీషియన్, పదవతరగతి/ఇంటర్ /డిగ్రీ అర్హతతో ప్రొడక్షన్ మెకానిక్ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలం మూడు నెలలు ఉంటుందని స్పష్టం చేశారు. ఇందు కోసం హెచ్‌టిటిపిఎస్://ఫారమ్స్.జిఎల్ఇ/వైటిఎం3కెఎఫ్ఐపియు 1డబ్యూజెయు5జిబి6లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8555909899, 6305110947 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు రామభద్రపురం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

రామభద్రపురం: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు రామభద్రపురం ఉన్నత పాఠశాల పీడీ కొల్లి తవిటినాయుడు గురువారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీతో పాటు హెచ్ఎం కె.కామేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీలలో శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించనున్న డిస్క్‌త్రో, షాట్‌పుట్, పరుగు పందెం రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు.

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి..!



కొలిమిలో ఇనుమును కాలుస్తున్న రాజస్థానీ మహిళలు



అద్దెకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న టార్పాలిన్‌లు

- వలస వచ్చి జీవనయానం
- వ్యవసాయ పనిముట్లు తయారీలో నిమగ్నం

కొత్తవలస: బతికిందే ఊరు..మానిందే మందు అన్న చందాన కష్టాన్నే నమ్ముకున్న వారికి భాష, ప్రాంతంతో పనిలేదని నిరూపిస్తున్నారు రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చి ఈ ప్రాంతాల్లో వ్యవసాయానికి సాయం చేస్తున్నారు. రాజస్థాన్ నుంచి వచ్చిన వారు ముడి ఇనుముతో వ్యవసాయ పనిముట్లు తయారు చేసి ఉపాధి పొందుతున్నారు. తెలంగాణ వాసులు ఇక్కడికి వచ్చి వరిచేల నూర్పులకు టార్పాలిన్‌లు అద్దెకు ఇస్తున్నారు. శ్రమజీవుల జీవనశైలిపై మానవీయ కథనం. పొట్ట చేతపట్టుకుని ఊరికి దూరంగా రాష్ట్రంకాని రాష్ట్రాలకు భాష తెలియని ప్రాంతంలో బతుకు పోరాటం చేస్తున్నారు వారు. శ్రమనే నమ్ముకుని కుటుంబాలతో సహా వలసబాట పట్టి వ్యవసాయ పనిముట్ల తయారీలో భాగంగా కొలిమిలో ఇనుము కాలుస్తూ పురుషలుతో సమానంగా మహిళలు కూడా సమ్మెట వేస్తూ పలు రకాల వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తున్నారు. డిసెంబర్ వచ్చిందంటే వందల కుటుంబాల వారు వలస బాటపట్టి విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాంకుళం జిల్లాలకు వలసవచ్చి సంప్రదాయ వ్యవసాయ పనిముట్లు తయారు చేసి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. తిరిగి ఫిబ్రవరి మెదటి వారంలో తిరుగు ప్రయాణమవుతారు. వలస వచ్చిన వారంతా రాజస్థాన్ రాష్ట్రంలోని సాగర్ జిల్లాకు చెందిన మార్వాడీ కుటుంబాల వారు.



కొలిమిలో కాల్చిన ఇనుమును సమ్మెటతో మోదుతున్న మహిళ

జిల్లాలోని పలు మండలాల్లో గల ముఖ్యమైన గ్రామాల్లో టెంట్లు వేసుకుని తాత్కలికంగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

అందరూ కష్టబడితేనే రోటీ

కుంటుంబంతో సహా వచ్చిన వారంతా తమ కడుపు నిండేందుకు రోటీలకు కావాల్సిన డబ్బులు కష్టపడి సంపాదించు కుంటున్నారు. మహిళలు కొలిమివేసి పాత ఇనుమును కాలిస్తే పురుషలు సమ్మెట వేస్తూ వస్తువులను తయారు చేస్తున్నారు. కత్తులు, గొడ్డళ్లు, కొడవళ్లు, రకరకాల వ్యవసాయ పనిముట్లతో పాటు ఇంట్లోకి అవసరమైన వస్తువులను తయారు చేస్తున్నారు. పెద్దలు తయారు చేసిన వస్తువులను చిన్నారులు ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయిస్తూ బతుకు పోరాటం సాగిస్తున్నారు.

తెలంగాణ నుంచి..

ఈ ప్రాంతంలో వరి కోతలు ప్రారంభమైతే తెలంగాణ, నెల్లూరు ప్రాతాల నుంచి పెద్ద ఎత్తున టార్పాలిన్‌లు పట్టుకుని కుంటుంబాలతో సహా వలస వస్తున్నారు. జిల్లాలోని ప్రతి జంక్షన్, ప్రధాన గ్రామాల్లో టార్పాలిన్‌లు గుట్టలుగా వేసి అద్దెకు ఇస్తుంటారు. ఆక్కడే చిన్న చిన్న గుడారాలను ఏర్పాటు చేసుకుని పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు.జనవరి చివరి నాటికి వారంతా తిరుగు ప్రయాణమవుతారు.

కుటుంబాలను పోషించుకోవడానికే



మా ప్రాంతంలో పంటలు సక్రమంగా పండక పోవడంతోనే జీవనోపాధి కోసం ఈ రంగాన్ని ఎంచుకున్నాం. గోనె సంచులు కొని అన్‌సీజన్‌లో టార్పాలిన్‌లు కుట్టి సీజన్‌లో ఆంధ్రాప్రాంతం వస్తున్నాం. సుమారు నెల రోజుల పాటు ఇక్కడ వ్యాపారం సాగుతుంది. టార్పాలిన్‌లకు ఈ ప్రాంతంలో మంచి గిరాకి ఉంది.

కె.బ్రహ్మయ్య, మహబూబ్‌నగర్, తెలంగాణ రాష్ట్రం

పని సులువుగా అవుతోంది



గ్రామాల్లో గతంలో మాదిరి వ్యవసాయ పనిముట్లు తయారు చేసే వారు కరువయారు. ప్రస్తుతం రాజస్థానీలు తయారు చేస్తున్న వస్తువులు ఎంతో నాణ్యంగా ఉంటున్నాయి. తెలంగాణ వాసులు సమకూరుస్తున్న టర్పాలిన్‌ల వల్ల పని సలుభమవడంతో పాటు ఖర్చు కూడా తగ్గి సమయం ఆదా అవుతోంది.

గుల్లిపల్లి అప్పలరాజు, శ్రీరాంపురం, లక్కవరపుకోట మండలం

పులి దాడిలో ఒక్క ఆవే మృతి

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో పులి దాడిలో ఒక్క ఆవు మాత్రమే మృతి చెందిందని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కేవీఎస్ రాజు గురువారం తెలిపారు.గ్రామానికి చెందిన రైతు పారాది చంద్ర మోహన్ ఆవు మృతి చెందినట్లు చెప్పారు. రెండు ఆవులపై పులి దాడి చేసినట్లు ఎక్కడా ఆనవాళ్లు తమకు లభించలేదని, పశువైద్యాధికారులు కూడా దొరికిన ఆవు కళేబరం ఒక్కటిగానే గుర్తించి పంచనామా నిర్వహించినట్లు చెప్పారు. ప్రసుత్తం పులి జాడ కోసం అటవీ ప్రాంతంలో అమర్చిన కెమెరాలను బట్టి అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలోని అనంతగిరి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు.

గడ్డి దగ్ధం



మంటలు ఆర్పుతున్న స్థానికులు

జామి: మండలంలోని లొట్లపల్లి గ్రామంలో ట్రాక్టర్‌తో ఉన్న వరి గడ్డి గురువారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు పెనల రాము అట్టాడలో వరి గడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై లొట్లపల్లి తీసుకువస్తుండగా కళ్లం దగ్గరకు వచ్చేసరికి అక్కడ ఉన్న విద్యుత్‌వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న గడ్డితో పాటు పక్కనే ఉన్న రాము సొంత గడ్డి వాము కూడా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి పూర్తి స్థాయిలో మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రైతుకు సుమారు రూ.40 వేల నష్టం సంభవించింది.

22న గుంటూరులో శాప్ టీటీ లీగ్ టోర్నీ

- ఆసక్తి గల వారికి ఆహ్వానం

విజయనగరం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 22న నిర్వహించబోయే టేబుల్ టెన్నిస్ లీగ్ టోర్నీలో ఆసక్తి గల జిల్లా క్రీడాకారులు పాల్గొనవచ్చని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు గురువారం తెలిపారు. గుంటూరులోని బీఆర్ స్టేడియంలో జరిగే పోటీల్లో అండర్-13,17, ఓపెన్ కేటగిరీలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 21లోగా వారి పేర్లను ఫోన్ 984829 8333 నంబర్‌కు సమాచారమిచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21న జగయ్యపేటలో బ్యాడ్మింటన్ లీగ్

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 21న జగ్గయ్యపేట మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో శాప్‌బ్యాడ్మింటన్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు తెలిపారు. అండర్-13, 17 వయస్సుల విభాగాల్లో బాల,బాలికలతో పాటు మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని, పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు ముందు రోజు సాయంత్రంలోగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

హత్య కేసు దర్యాప్తు ప్రారంభం



సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామానికి సమీపంలోని మామిడి తోటలో ఈ నెల 16న లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంపై స్థానిక పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దానిని ఛేదించేందుకు గురువారం దర్యాప్తు ప్రారంభించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన స్థలాన్ని బుధవారం సాయంత్రం ఎస్పీ దీపికాపాటిల్ పరిశీలించిన విషయం తెలిసిందే. ఎస్పీ ఆదేశాల మేరకు బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు ఆధ్వర్యంలో తెర్లాం, బాడంగి, రామభద్రపురం ఎస్సైలు ఆర్.రమేష్, జయంతి, సురేంద్రనాయుడులు మూడు బృందాలుగా ఏర్పడి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ప్రదేశానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. అలాగే విశాఖపట్నం నుంచి క్లూస్ టీం చేరుకుని సంఘటన స్థలంలో నిశితంగా పరిశీలించింది. అలాగే ఈ నెల 16కి ముందు రాజాం నుంచి రామభద్రపురం, రామభద్రపురం నుంచి రాజాం ఆర్అండ్‌బీ రోడ్డులో రాత్రి వేళల్లో వచ్చిన వాహనాల రాకపోకలను గుర్తించేందుకు సీసీ కెమెరాల్లో నమోదైన సీసీ ఫుటేజ్‌లను పరిశీలించేందుకు పోలీసులు అవసరమైన చర్యలు చేపట్టారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న ఈవో రాధాకృష్ణ, ట్రస్టు బోర్డు చైర్మన్ దాలినాయుడు

మక్కువ: శంబర జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు అన్ని చర్యలు చేపడుతున్నామని పోలమాంబ ఆలయ ఈఓ రాధాకృష్ణ, ట్రస్టుబోర్డు చైర్మన్ దాలినాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ జాతరలో 95 మంది దేవాదాయ శాఖ సిబ్బంది డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోలమాంబ అమ్మవారి దర్శన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విక్రయించనున్నామని తెలిపారు. ప్రత్యేక దర్శనం రూ.10, శీఘ్రదర్శనం రూ. 50, ఉచిత దర్శనాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. చదురుగుడి, వనంగుడి ఆలయాల వద్ద పెండాల్స్‌తో క్యూలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 150 గ్రాముల పులిహోర రూ.10, 80 గ్రాముల లడ్డూ రూ.15 చొప్పున భక్తులకు విక్రయించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జాతరకు సుమారు లక్షా50 వేల మంది వరకు భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ధర్మకర్తల మండలి తీర్మానం ప్రకారం సిరిమానోత్సవం నిర్వహించే కమిటీ సభ్యులు ఎంపిక కోసం ఈ ఏడాది వేలం పాట నిర్వహించినట్లు తెలిపారు.

కోడి పందెం నిర్వాహకుల అరెస్టు

గంట్యాడ: మండలంలోని గింజేరు గ్రామంలో రాళ్ల గెడ్డ వద్ద కోడి పందాలు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడి చేసి పందెం నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 9590 స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల: రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాల గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర సలహాదారు సముద్రపు రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి జరజాపుపేటలోని ఆయన స్వగృహంలో రెండు జిల్లాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లకు చెల్లిస్తున్నట్లుగానే డీలర్లకు కూడా ప్రభుత్వం గౌరవ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే తమకు రావాల్సిన ఎండీఎం రైస్ కమిషన్, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న సరుకుల కమిషన్‌ను సంఘం ట్రస్ట్‌కు బదలాయించాలని కోరారు. రెండు జిల్లాల్లో ఇప్పటివరకు మృతిచెందిన 125 మంది డీలర్ల కుటుంబ సభ్యులకు ట్రస్ట్ ద్వారా రూ.10వేల చొప్పున ఫిబ్రవరిలో అందించడానికి తీర్మానం చేశారు. కందిపప్పు, పంచదార క్రెడిట్‌పై ఇప్పించాలని తీర్మానిస్తూ ఆ కాపీలను అధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రెండు జిల్లాల సంఘం ప్రతినిధులు వాన నారాయణరావు, గేదెల సత్యనారాయణ, స్కుకి సూర్యారావు, పాలూరు అప్పారావు, అట్టాడ అప్పారావు, కుసుమంచి జగ్గయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

- ముద్రించినా, వినియోగించినా కఠిన చర్యలు
- కలెక్టర్ సూర్యకుమారి హెచ్చరిక

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి జిల్లాలో ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగాన్ని నిషేధించాలని సంబంధిత విభాగాల అధికారులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు అన్ని విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం గురించి అనుసరించాల్సిన విధానాన్ని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం తన చాంబర్‌లో అధికారులతో సమావేశంలో సమీక్షించి మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓలో పేర్కొన్న నిబంధనలను తు.చ.తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ఈనెల 26 నుంచి జిల్లాలో ఎక్కడా ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీల స్థానంలో పర్యావరణ హితమైన క్లాత్ బ్యానర్లను వినియోగించుకోవాలని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఇంకా ఎవరైనా ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేసినా, విక్రయించినా మొదటి తప్పుగా రూ.50 వేలు, రెండోసారి తప్పు చేస్తే రూ.లక్ష జరిమానాతో పాటు సంబంధిత పరిశ్రమ లేదా షాప్‌ను సీజ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. శుభకార్యాలు, పబ్లిక్ మీటింగ్‌లు, ర్యాలీలు, ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ బ్యానర్లను ప్రదర్శించరాదని, తయారు చేయరాదని ఇతర ప్రాంతాలకు తరలించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో మరింత పర్యవేక్షణ అవసరమని అభిప్రాయ పడ్డారు.

వాయు కాలుష్యం లేకుండా ప్రమాణాలు పాటించాలి

జిల్లాలోని పట్టణాల పరిధిలో గాలి నాణ్యతను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ, మున్సిపల్ విభాగ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వాయు కాలుష్యం లేకుండా ప్రమాణాలు పాటించాలని గురువారం జరిగిన సమావేశంలో అధికారులకు సూచించారు. కేంద్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రూపొందించిన విధివిధానాలను తప్పకుండా పాటించాలని పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే పొగ ద్వారా గాలి నాణ్యతను పరిశీలించాలని వాయు కాలుష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్లు, పట్టణ ఆరోగ్య అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ విభాగం ఈఈ సుదర్శనం, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ పాపారావు, మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, ఆర్‌టీఓ ఆదినారాయణ, ఇతర విభాగాల జిల్లాస్థాయి అధికారులు, పోలీసు అధికారులు,



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ప్లాస్టిక్ తయారీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

సమన్వయంతో రహదారి భద్రతా వారోత్సవాలు

- కలెక్టర్ సూర్యకుమారి



రోడ్ సేఫ్టీ వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, ఎస్పీ దీపికా పాటిల్

విజయనగరం అర్బన్: ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్న రహదారి భద్రతా వారోత్సవాల్లో ప్రభుత్వ శాఖలన్నీ పాల్గొని ప్రమాదాల నివారణకు వారి సలహాలు, సూచనలను అందించాలని కలెక్టర్ సూర్యకుమారి కోరారు. రహదారి ప్రమాదాలను తగ్గించడానికి శాఖల మధ్య సమన్వయం చాలా అవసరమన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఆర్‌టీసీ బస్సులను రహదారిపై ఎక్కడపడితే అక్కడ ఆపకుండా నిర్దేశించిన స్టాప్ లలోనే ఆపేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు బజార్ల ముందు రహదారులపై దుకాణాలు అధిక సంఖ్యలో వెలుస్తున్నాయని వాటిని నిరోధించాలని సూచించారు. రహదారి భద్రతపై పాఠశాలలలు, కళాశాలల్లో విద్యాశాఖ ద్వారా అవగాహన తరగతులను నిర్వహించాలని చెప్పారు. ఈ వారోత్సవాల్లో రహదారి గుర్తులు, భద్రతపై విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించాలన్నారు. వీలైతే సిలబస్‌లో చేర్చి వారానికి ఒక తరగతి నిర్వహించాలని కోరారు. భోగాపురం హైవే పై పశువుల సంచారం, పాదచారుల క్రాసింగ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసు అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వాటిని నిరోధించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, సర్పంచ్‌లతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పోలీస్, జాతీయ రహదారుల శాఖ సంయుక్తంగా తనిఖీ చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఓవర్ లోడ్ వల్ల ప్రమాదాలు

వాహనాలపై ఓవర్ లోడ్ వల్ల, కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నియంత్రించాలని పోలీస్ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఒకరిద్దరికి అపరాధ రుసుం వేస్తే ఓవర్ లోడింగ్ తగ్గించవచ్చని అభిప్రాయ పడ్డారు. అదే విధంగా హెల్మెట్ వాడకాన్ని కూడా ప్రోత్సహించాలని పోలీసు, రవాణా శాఖలే కాకుండా రెవెన్యూ ఇతర శాఖలు కూడా ఇందుకు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎస్పీ దీపిక పాటిల్ మాట్లాడుతూ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన, మరణించిన వారి ఫొటోలను, వాహనాలను రహదారి కూడళ్లలో ప్రదర్శించాలని వాటిని చూసే వారికి భయం, బాధ్యత కలుగుతాయన్నారు. సమావేశంలో రవాణా శాఖ ఉప కమిషనర్ సుందర్, జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర రమణకుమారి, డీసీహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, డీఈఓ బీ.లింగేశ్వరరెడ్డి, ఆర్‌టీసీ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.